క్లుప్తంగా

మృతురాలి కుటుంబానికి పరామర్శ



మౌనిక మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీచరణ్‌రెడ్డి

రొద్దం: గౌరాజుపల్లి గ్రామానికి చెందిన కురుబ శ్రీనివాసులు కుమార్తె మౌనిక బుధవారం బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నేత శ్రీచరణ్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని మౌనిక మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న వెంకప్ప స్వామిజీ

అమరాపురం: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ఉల్లాసం, సుఖశాంతులు, వర్షాలు బాగా కురుస్తాయని కర్ణాటక రాష్ట్రం మైలార నుంచి వచ్చిన వెంకప్పస్వామిజీ అన్నారు. గురువారం మండలంలోని కనకనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసే మైలారలింగేశ్వరస్వామి దేవాలయానికి భూమి పూజను భక్తులు, స్వామిజీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో స్వామిజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేవుడిని కొలవాలన్నారు. దైవ భక్తి మానసిక ప్రశాంతత కలుగజేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక దళిత నాయకులు, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

గోరంట్ల: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలు.. రాంపురం గ్రామానికి చెందిన శ్రీరాములు తన భార్యతో సన్నిహితంగా ఉన్నాడంటూ మల్లేల గ్రామానికి చెందిన మాదిగ ఆంజనేయులు అతడితో గొడవకు దిగాడు. ఈక్రమంలో శ్రీరాములు తనను కులంపేరుతో దూషించినట్లు బాధితుడు ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

డీసీఎంతో ఎమ్మెల్యే భేటీ



డీసీఎం డీకే శివకుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ: స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తుమకూరు సహకార పాలు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంలో తొలిసారిగా రాష్ట్ర డీసీఎం డీకే శివకుమార్‌ను గురువారం విధానసౌధలో భేటీ అయ్యారు. పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రణాళిక శాఖ మంత్రి సుధాకర్, స్థానిక క్లాస్ వన్ కాంట్రాక్టర్ ఏ శంకరరెడ్డి పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న కడప జోనల్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్

రొద్దం: మలేరియాపై అప్రమత్తత అవసరమని మలేరియా కడప జోనల్ అధికారి డాక్టర్ లక్ష్మీ నాయక్, ఎంపీహెచ్‌ఈఓ జెడ్‌ఎంఓ అధికారి కడప నిత్యపూజయ్య అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ల్యాబ్ ద్వారా రోగులకు అందుతున్న రిపోర్టులను పరిశీలించారు. మలేరియా, డెంగీ కేసుల నమోదుపై ల్యాబ్ టెక్నీషియన్ శ్రవణ్‌తో ఆరాతీశారు. మలేరియా వ్యాపించే విధానం, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు సోమశేఖర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, ఎస్‌ఎండీ బాషా పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలోని గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలు సీజనల్ వ్యాధులను పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని డాక్టర్ శ్రీనివాసనాయక్, ప్రిన్సిపాల్ మద్దిలేటి కోరారు. గురువారం గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధి నివారణకు కృషి చేయాలన్నారు.

భక్తుల కొంగుబంగారం వీరకేతమ్మ

- రేపటి నుంచి అమ్మవారి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న కమిటీ సభ్యులు

మడకశిరరూరల్: మండల కేంద్రానికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కల్లుమర్రి గ్రామ సమీపంలో వెలసిన వీరకేతమ్మ అమ్మవారిని భక్తులు కొంగుబంగారంగా కొలుస్తున్నారు. 900 సంవత్సరాల క్రితం గంతలపల్లికి చెందిన వీరకేతమ్మ కల్లుమర్రి గ్రామంలోని భర్త వీరకేతప్పకు నిరంతరం సేవలో ఉంటుండేది. వీరి కులవృత్తి గొర్రెల పెంపకం. ఆమె దేవతగా మారి భక్తుల పాలిటి కల్పవృక్షంగా నిలిచింది. ప్రతి మంగళ, శుక్రవారంలో అర్చకులు గంగాధరప్పస్వామిని ఆవహించి భక్తులు కోరిన న్యాయమైన కోర్కెలను తీర్చుతోంది. ఈమెకు ఎల్లరూ ఒక్కటే.. ఈమె పిలిచిన వారు మాత్రమే వరుస నుంచి వెళ్లాలి. ప్రతి శుక్రవారం మహిళలకు గాజుల పంపిణీ జరుగుతుంది. శారీరక, మానసిక బాధలు, దుష్ట గ్రహ పీడలు, సంసారిక కష్ట నష్టాలు ఈమె దయచే తొలుగుచున్నవి. రోజు రోజుకు భక్తు సంఖ్య పెరుగుతోంది. ఈమె అగ్ని ప్రవేశం చేసిన చోటనే భక్తులు దేవస్థానం నిర్మించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా వారం రోజుల పాటు భక్తులకు అమ్మవారు ప్రత్యేక అలకంరణలో దర్శనమిస్తున్నారు. ఆలయం వద్ద పెద్ద నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.



ప్రత్యేక అలంకరణలో వీరకేతమ్మ

రెండు రోజులు పండుగ వాతావరణ

వీరకేతమ్మ ఉత్సవాల సందర్భంగా మణూరు, సీ కొడిగేపల్లి, కల్లుమర్రి పంచాయతీల గ్రామాల్లోని అమ్మవారి భక్తుల ఇంట పండుగ వాతావరణం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రాంతాల నుంచి అమ్మవారి భక్తులు ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుంటారు. కాగా దాతలు అమ్మవారి భక్తులకు భోజన శాలను నిర్మించారు.

నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన

మండలంలోని దిన్నెమీదపాళ్యం గ్రామంలో దాతలు, భక్తుల సహకారంతో రూ.10 లక్షల నిధులతో నూతనంగా ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. ఆ ఆలయంలో ప్రసన్న ఆంజనేయస్వామి సంప్రోక్షణ, బహ్మ కలశ ప్రతిష్ఠా బంధనం, అభయాంజనేయస్వామి, బైలాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాన, కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఫిబ్రవరి 1న మహాగణపతి, నవగ్రహ పూజ, మృత్యుంజయ, పవమాన, హోమం, సీతారామ కల్యాణం, 2వ తేదీ నూతన విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రాణ ప్రతిష్ఠ ప్రధాన హోమం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.



వీరకేతమ్మ అమ్మవారి అలయం



నాగదేవత విగ్రహం

దాతల సాయంతో అన్నదానం

వీరకేతమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1వనుంచి రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 1న కలశ స్థాపన, కల్యాణోత్సవం, జ్యోతుల ఉత్సవం, 2న తోమాల సేవ, నాగదేవతా పూజ, హోమం, చండీయాగం, మధ్యాహ్నం వేలాది మంది భక్తుల మధ్య అమ్మవారి బ్రహ్మరథోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు, భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

భక్తుల సంఖ్య పెరుగుతోంది



వీరకేతమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందడానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకుని పోతారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడున్న వారు మంగళవారం, శుక్రవారం వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందుతున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– గంగాధరప్ప స్వామి అర్చకుడు, కల్లుమర్రి

నేడు గోనిమేకులపల్లిలో ఉషశ్రీచరణ్ పర్యటన

రొద్దం: రెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని గోనిమేకులపల్లిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీరణ్ పర్యటించనున్నారు. ఈమేరకు ఆమె కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశాయి. మధ్యాహ్నం 3 గంటలకు పర్యటన ఉంటుందని, మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరాయి.

పెంపుడు జీవాలపై శ్రద్ధ తీసుకోండి

రొళ్ల: పెంపుడు జీవాలపై రైతులు, కాపరులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పశువైద్యశాఖ జేడీఓ వెంకటేశులు సూచించారు. గురువారం మండలంలోని హొట్టేబెట్ట పంచాయతీ కేంద్రంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 850 గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. నట్టల నివారణ మందులు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. అనంతరం 170 ఆవులకు సాధారణ వైద్య చికిత్సలు అందించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: మండల కేంద్రంలో ఎస్‌ఐ.ఇషాక్‌బాషా ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఉదుగూరులో ఫిబ్రవరి 5వ తేది వరకు అమ్మవారి జాతర ఉన్నందున, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ప్రతి వాహనాన్నీ పరిశీలించామన్నారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పక ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐలు రామాంజనేయులు, రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను నట్టేట ముంచారు

అగళి: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. అధికారం కోసం రైతులను సీఎం చంద్రబాబు నమ్మించి నట్టేటముంచారని సమన్వయకర్త ఈరలక్కప్ప మండిపడ్డారు. గురువారం మండలకేంద్రంలోని శంకరేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విషం చిమ్మిన సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎందుకు పథకాల అమలుపై దాట వేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉందన్న విషయం చంద్రబాబుకు ముందే తెలీదా..అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ముఖ్యమంత్రి పదవి కోసమే చంద్రబాబు తప్పుడు హామీలు ఇచ్చారన్నారు. తల్లికి వందనం ఇస్తామని మహిళలను, 50 ఏళ్లకే బీసీలకు ఫించన్లు ఇస్తామని బీసీలను మోసం చేశారని మండిపడ్డారు. రైతులకు అన్నదాన సుఖీభవ కింద రూ.20 వేలు అందిస్తామని, శఠగోపలం పెట్టారన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ ద్వారా శ్రీశైలం నీళ్ల తీసుకురావడానికి ఉన్న కాలువను వెడల్పు చేయకుండా ఉన్నదానికే కాంక్రీట్ వేసి పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు చూస్తున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతులకు పంపిణీ చేయకుండా, ఎలాంటి దరఖాస్తులు చేయకుండా తెలుగుదేశం నాయకులు ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్లి పోతున్నారని ఆరోపించారు. ఫిబ్రవరి 6న ఉదయం 10 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో హంద్రీనీవా కాలువ, విద్యుత్ సమస్యలపై నిరసన చేపడతామన్నారు.అనంతరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి అనుబంధ కమిటీల నాయకులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ , సర్పంచులు శివకుమార్, ముద్దరాజు, రామకృష్ణప్ప, బసవరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకుమార్, నాయకులు హేమంతరాజు, సదనాంద ఆరాధ్య, మధు, సూర్యనారాయణరెడ్డి, మైలారప్ప, నందీష్, రామచంద్రప్ప, బోజే గౌడ్ల, ఈరన్న, మల్లికార్జున, లింగరాజు, హనుమంతరాయప్ప,తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

క్రమశిక్షణతో ఉజ్వల భవిష్యత్

రొళ్ల: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని పెనుకొండ ఆర్డీఓ టి.ఆనంద్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని దొమ్మరహట్టి గ్రామం వద్ద ఉన్న అంబేడ్కర్ బాలురు గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టిను తనిఖీ చేశారు. ఏజెన్సీ ద్వారా సరఫరా అయిన నిత్యవసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. రోజూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని వడ్డించాలని ఆదేశించారు. పిల్లల చదువుపై ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని సూచించారు. అనంతరం తూభినకుంట రెవెన్యూ పొలం పరిధిలో జరుగుతున్న సమగ్ర భూ రీసర్వే పనులను పరిశీలించారు. అలాగే స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, ఏఎన్‌ఎంలు, మహిళ పోలీసులతో పాటు అగ్రికల్చర్ అసిస్టెంట్లు, అంగనవాడి వర్కర్లు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 1న పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని పగడ్బందీగా చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి, ప్రిన్సిపల్ మైలారప్ప, ఆర్‌ఐ గిరియప్ప, రెవెన్యూ, సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాలలో సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయండి

హిందూపురం: మహాత్మా గాంధీ చూపిన అహింసా, శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పి శివ అన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీఎన్ దీపిక ఆధ్వర్యంలో గురువారం పార్టీ ఆఫీసులో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్ గౌడ్, శ్రీరాం రెడ్డి, జిల్లా స్పోక్‌పర్సన్ శివ శంకర్ రెడ్డి, కౌన్సిలర్లు మల్లికార్జున, రామచంద్ర, నాగేంద్రబాబు, టౌన్ ప్రెసిడెంట్ మన్సూర్ ఖాన్, వార్డు ఇన్‌చార్జ్‌లు సహేరా బాను, నౌషాద్, ఫారూఖ్, మనోజ్ మింటు, రామకృష్ణా రెడ్డి, అసిఫ్‌ఖాన్, శ్రీనాథ్, అయూబ్ బేగ్, దాదు, న్యాత రెడ్డి, నరసింహులు, చాందు. శ్రీరాములు, కవిత, నాగేంద్ర, బాబాజాన్ పాల్గొన్నారు.

మడకశిర రూరల్: మండలంలోని జిల్లెడుగుంట ప్రాథమికోన్నత పాఠశాల, గుండుమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది మహాత్మగాంధీ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .

పెనుకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వైస్ ప్రిన్సిపాల్ జయప్ప గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ దేశానికి గాంధీజీ చేసిన సేవలను కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: కుష్టు బాధితులను ఆదరించాలని వైద్యుడు ఓంకార్ తెలిపారు. సాయినగర్‌లో గురువారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్ వైజర్ రవీంద్ర, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



హిందూపురం: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇసుక ట్రాక్టర్ సీజ్

పరిగి: పెన్నా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు. మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

గుడిబండ: చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప సూచించారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని నాగేపల్లి దళితవాడలో ఎస్సీ, ఎస్టీల చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న సమస్యలను పెద్దవి చేసుకుని ఘర్షణలకు పడరాదని సూచించారు. భూ తగాదాలు ఉంటే అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలన్నారు. యువత ఆన్‌లైన్ జాబ్‌లను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కంటి చికిత్స శిబిరం

పావగడ: స్థానిక హెల్ప్ సొసైటీ, సేవా ట్రస్ట్, బెంగుళూరు శంకర కంటి ఆస్పత్రి నేతృత్వంలో ఉచిత కంటి చికిత్స శిబిరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించుకోగా.. 47 మంది రోగులు శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. వారిని బెంగుళూరు లోని శంకర కంటి ఆస్పత్రికి ప్రత్యేక వాహనంలో తరలించారు. శంకర కంటి ఆస్పత్రి వైద్యులు సునీత, మౌనిక కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరం నిర్వాహకుడు హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు మానం శశి కిరణ్ తదితరులు కంటి రోగులకు సేవలందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

అగళి: మండల కేంద్రం సమీపంలో 544 ఈ జాతీయ రహదారిపై ఉన్న వంతెనను గురువార సాయంత్రం ఓ కారు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన మేరకు.. వన్నార్లపల్లికి చెందిన ఓ వ్యక్తి శిర నుంచి రొళ్ల మండలంలోని స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. వేగంగా వస్తున్న కారును డ్రైవర్ నియంత్రించలేకపోవడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.



వంతెనను ఢీకొన్న కారు

టీడీపీలో వర్గ విభేదాలు బట్టబయలు

- రోడ్డు పనులను అడ్డుకున్న ఎంపీ పార్థసారథి వర్గీయులు

గోరంట్ల: పెనుకొండ నియోజకవర్గంలోని టీడీపీలో వర్గవిభేదాలు బట్టబయలయ్యాయి. వివరాలు.. ఎన్నికల ముందు నుంచి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితమ్మ, హిందూపురం ఎంపీ బీకె పార్థసారథి మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. మలసముద్రంలో సీసీరోడ్డు నిర్మాణ విషయంలో మరోసారి విభేదాలు బయటపడ్డాయి. వివరాలు..మలసముద్రం పంచాయతీలో రోడ్ల నిర్మాణానికి రూ.41 లక్షలు మంజూరయ్యాయి. పనులను స్థానికులకు అప్పగించకుండా కడప జిల్లా వాసికి అప్పగించినట్లు గుర్తించిన స్థానిక సర్పంచ్ సువర్ణ భర్త అశ్వత్థరెడ్డి(ఎంపీ పార్థసారథి వర్గీయుడు) స్థానిక టీడీపీ నాయకులతో కలిసి గురువారం పనులను అడ్డుకున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి పోలీసులు, ఇంజినీర్లతో మాట్లాడి పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. మరోవైపు అశ్వత్థరెడ్డితో కూడా చర్చించినట్లు తెలిసింది. పంచాయతీలో జరిగే పనులను సర్పంచ్, స్థానికులకు కాకుండా ఇతర జిల్లాల వారికి ఎలా అప్పగిస్తారని అశ్వత్థరెడ్డి మంత్రిని నిలదీసినట్లు సమాచారం. ఇక నుంచి పంచాయతీలో పార్టీ కార్యక్రమాలను కూడా కాంట్రాక్టర్‌తోనే నిర్వహించుకోవాలని మంత్రికి తేగేసి చెప్పినట్లు తెలుస్తోంది.



టిప్పర్‌ను అడ్డుకున్న మలసముద్రం నాయకులు

సంక్షిప్త సమాచారం

వివాదాస్పద రహదారి పరిశీలన

పెనుకొండ రూరల్: రాంపురంలో వివాదంగా మారిన రహదారిని గురువారం రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. వెంకటరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బంగారప్ప గారి ప్రసాద్, శ్రీనివాసులు, వెంకటేషు తదితర రైతులు తమ పొలాలకు వెళ్లే దారి లేకుండా చేశారని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రహదారిపై సర్వే చేపట్టినట్లు వీఆర్వో ప్రవల్లిక తెలిపారు.

నేడు ఆర్టీసీ నూతన సర్వీసు ప్రారంభం

పెనుకొండ రూరల్: ప్రయాణికుల సౌకర్యార్థం శుక్రవారం నుంచి పెనుకొండ–హైదరాబాద్ సర్వీసును ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ రామసుబ్బయ్య గురువారం తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ బీ.కే పార్థసారథి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు సర్వీసును ప్రారంభిస్తారన్నారు.

రేపు కళాశాలలో 'ఓపెన్ డే'

హిందూపురం టౌన్: విద్యార్థినులకు ఉన్నత ప్రమాణాలు, సదుపాయాలు అందించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఎన్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రగతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 1న కళాశాలలోని సదుపాయాలు, డిగ్రీలో ప్రవేశపెట్టిన సింగల్ మేజర్ కోర్సులపై అవగాహన కోసం 'ఓపెన్ డే' పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులను కళాశాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. క్విజ్, పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

మడకశిర: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గురువారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు కౌన్సిలర్లు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం అభివృద్ధి పనులపై చర్చించి, పలు పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కమిషనర్ రంగస్వామి, ఏఈ మురళి, మేనేజర్ నజీర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కెంచమాంబదేవి ఉత్సవాలు ప్రారంభం

అమరాపురం: ఉదుగూరు గ్రామంలో వెలసిన వక్కలిగ కులస్తుల సోమేనహళ్లి జానకల్లు గోత్రానికి చెందిన కుల దైవం కెంచమాంబదేవి పెద్ద జాతర ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి.

నేడు విద్యాసంస్థల బంద్

హిందూపురం టౌన్: శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చామని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. గురువారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు బలవన్మరణం

పెనుకొండ రూరల్: బీటీఆర్ కాలనీలో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన నాగరాజు, అంజినమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు వంశీ వర్ధన్(19) కియా అనుబంధ పరిశ్రమలో పనిచేసేవాడు. గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కాగా.. యువకుడి ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.